

ముస్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

## రూ.30కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

**అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీని రూ.30కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పాలకవర్గం చివరి సాధారణ సమావేశం చైర్‌పర్సన్ జయశ్రీ రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీలను ప్రజలందరికీ అందిస్తామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మన్సూరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని భవానీనగర్, మధురానగర్, శ్రీరామ్‌హిల్స్ కాలనీల్లో శుక్రవారం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బాబ్‌కట్ సాయంతో పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. ఈసందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంట్లోని చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ రిక్షాల్లో మాత్రమే వేయాల ని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ నీలిమ, ఎస్ఎస్ చంద్రశేఖర్, శానిటేషన్ సూపర్‌వైజర్ హమీద్, లక్ష్మణ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పద్మారావు, ఆర్‌వీకే వర్మ, సీత, వెంకటేష్, నర్సింహ, బీరప్ప, కృష్ణ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.



చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

## థీమ్‌పార్కుల ఏర్పాటుకు చర్యలు

**సైదాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** డివిజన్ పరిధిలో మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా థీమ్ పార్కుల ఏర్పాటు కోసం కృషిచేస్తానని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సరస్వతీనగర్ కాలనీలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించారు. ఇప్పటికే డివిజన్‌లో రెండు కాలనీల్లో థీమ్ పార్కులు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు అమర్నాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, బుస్సా శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

## జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్‌కు ప్రజలు సహకరించాలి


**సైదాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** పాత వస్తువుల సేకరణకు జీహెచ్‌ఎంసీ చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ప్రజలందరూ సహకరించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి కోరారు. ఎస్‌బీహెచ్ ఏ కాలనీ మాధవనిలయం పార్కులో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఇంట్లోని పాతసామన్లు, నిరూపయోగంగా ఉన్న వస్తువులను సేకరించే కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ చేపట్టిందని తెలిపారు. వాటిని నాలాలు, రోడ్లపై వేయకుండా సేకరణ కేంద్రంలో అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్(శానిటేషన్) శంకర్‌సింగ్ రాథోడ్, ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్, ఎస్ఎస్ గోవిందరెడ్డి, జవాన్లు నర్సింగరావు, యాదయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

**చంపాపేట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం గణపతి హోమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించిన ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహిస్తున్న గణపతి హోమంలో భక్తులు



మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. పంట చేతికి రావడంతో అమ్ముకోవడానికి రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. శుక్రవారం ఒక్కరోజే 5 క్వింటాళ్ల పంట మార్కెట్‌కు వచ్చింది.
- ఓల్డ్‌మలక్‌పేట, ఆంధ్రజ్యోతి

# సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో తొలగనున్న ప్రతిష్టంభన..!

- ఆలయ కమిటీ ప్రతినిధులతో అధికారుల రాజీ ఒప్పందం
- స్టీల్ బ్రిడ్జి అంచనా వ్యయం రూ.620 కోట్లకు పెంపు
- నాలుగేళ్లుగా సాగుతున్న పనుల అడ్డంకికి పరిష్కారం



చంచల్‌గూడ చౌరస్తాలో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు



సైదాబాద్ చౌరస్తాలో ముందుకు సాగని నిర్మాణం

**సైదాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** సైదాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగనుంది.ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పుతో ఏర్పడిన వివాదాన్ని ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు జోక్యం చేసుకుని ఆలయ కమిటీతో రాజీ కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీంతో సైదాబాద్ చౌరస్తా ప్రాంతంలో నిలిచిపోయిన పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. కేబుల్ బ్రిడ్జి పనులు నత్తనడకగా సాగుతుండడంతో ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూలై 2020లో అప్పటి మంత్రి కేటీఆర్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. 24 నెలల్లో స్టీల్ బ్రిడ్జి వాహనదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని కేటీఆర్ బహిరంగంగా ప్రకటించారు. కానీ నాలుగేళ్లు గడిచినా పనులు అసంపూర్తిగానే కొనసాగుతున్నాయి. చంచల్‌గూడ ప్రెస్ నుంచి సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వరకు నాలుగు లైన్ల స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం స్ట్రాటజికల్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్ఆర్‌డీపీ) కింద రూ.523.37 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబడుతుంది. ఇందులో రూ.370 కోట్లు నిర్మాణ వ్యయం, రూ. 153.37 కోట్లు భూసేకరణ కోసం కేటాయించారు. అయితే స్టీల్ ధరలు పెరిగిన నేపథ్యంలో అంచనా వ్యయాన్ని రూ.620 కోట్లకు పెంచుతూ ఈనెల 8న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 3.38కిమీల మేర నాలుగు లైన్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. 88 పిల్లర్లపై బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. రీన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్(ఆర్‌సీసీ) డెక్ స్లాబ్‌తో స్టీల్ పియర్లు, స్టీల్‌పైర్ క్యాప్, స్టీల్ గర్డర్లతో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే నల్గొండ ఎక్స్‌రోడ్డు నుంచి ఓవైసీ ఆస్పత్రి జంక్షన్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండడంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుంది. ముఖ్యంగా చంపాపేట చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వారితో పాటు శంషాబాద్ విమానాశ్రయం, కేంద్ర రక్షణ రంగ సంస్థలకు, శ్రీశైలం, నాగార్జునసాగర్ వెళ్లే వైపు ప్రయాణం సులువవుతుంది. చంచల్‌గూడ, సైదాబాద్, ధోబీఘాట్, ఐఎస్‌సదన్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. అంతేగాకుండా ఐఎస్‌సదన్ నాలుగు కూడలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు మోక్షం కలుగనుంది.

### అలైన్‌మెంట్ మార్పుపై సమసిన వివాదం..

స్టీల్‌బ్రిడ్జి ముందస్తు అలైన్‌మెంట్ ప్రతిపాదనను అధికారులు కొందరికి అనుకూలంగా మార్పు చేశారన్న ఆరోపణలు వివాదానికి తెరలేపాయి. అలైన్‌మెంట్ మార్పు వల్ల సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టవద్దంటూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు పెద్దఎత్తున నిరసన దీక్ష చేపట్టారు. దీంతో 11 నెలలుగా నిర్మాణ పనులను నిలిపివేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు ఆలయ కమిటీ ప్రతినిధులతో అధికారులు సమావేశమై రాజీ ఒప్పందం చేశారు. ఆలయాన్ని ప్రత్యామ్నాయంగా వెనుక భాగం ఉన్న 200 గజాలకు పైగా స్థలం మంజూరు చేసే విధంగా అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు ఆలయ కమిటీ, నేతలు అంగీకరించడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంది.



ఆలయం ముందు నిలిచిన పనులు

# గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**వనస్థలిపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** గ్రంథాలయ భవనానికి మోక్షం ఎప్పుడో.. అని ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి సంబంధిత రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి స్పం దించారు. శుక్రవారం వనస్థలిపురంలోని గ్రంథాలయ భవనాన్ని కాలనీవాసులతో కలిసి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పరిశీలించి, నిలిచిపోయిన పనుల కారణాలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వలన గ్రంథాలయ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. ఈ గ్రంథాలయ నిర్మాణ పనులను అతి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పునఃప్రారంభిస్తామన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ గ్రంథాలయాన్ని నూతన హంగులతో కూడిన మోడల్ గ్రంథాలయంగా నిర్మించి డిజిటల్ గ్రంథాలయంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆహ్లాదకరమైన వా తావరణంలో నూతన గ్రంథాలయాన్ని త్వరితగతిన నిర్మించి ప్రజలకు, పాఠకులకు అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. నిలిపోయిన గ్రంథాలయ పనులు పునఃప్రారంభించడం హర్షనీయమని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తు సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతి దినపత్రికకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వనస్థలిపురం గ్రంథాలయ ప్రతినిధులు కె.వీరప్ప, పద్మ, కాలనీవాసులు సీ.హెచ్.వీ.ఆర్.కే మూర్తి, వీ.వీ.కే సోమయాజులు, జైపాల్‌రెడ్డి, వర్ధిని, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.



వనస్థలిపురం గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

# బెల్టు షాపుల్లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

- ఐదుగురు అరెస్టు, మద్యం స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**సరూర్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** 'ఎనీటైం మద్యం గురూ..!' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు షాపుల్లో నిరంతరం మద్యం లభిస్తున్నట్టు వార్తా కథనంలో పేర్కొన్న నేపథ్యంలో.. శుక్రవారం సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నందనవనం, బాలాపూర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జిల్లెలగూడ, లెనిన్‌నగర్, అల్మాస్‌గూడ తదితర ప్రాంతాల్లోని పలు బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు షాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న 16.9లీటర్ల బీరు, 21.52లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు విక్రయదారులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇకపై బెల్టు షాపులపై తరచుగా దాడులు జరుపుతామని, అక్రమ విక్రయాలను అరికడతామని ఆయన చెప్పారు.



బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుంటున్న సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు

# రైతు భరోసా కోసం.. సాగు చేయని భూముల పరిశీలన ప్రారంభం

- హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ప్రత్యేక బృందాలు

**హయత్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం సాగుచేసే భూములకే రైతు భరోసా ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో అధికారులు ఆయా మండలాల్లో సాగుకు పనికి వచ్చే భూములను, సాగుకు పనికి రాని భూములను లెక్క తెల్చే పనిలో పడ్డారు. అందుకోసం మండలాల వారీగా అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు చెందిన అధికారుల బృందాలు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. హయత్‌నగర్ తహసీల్దార్ జానకీ, ఆర్ఐ నర్సింహయాదవ్‌తో పాటు వ్యవసాయ అధికారులు సాహెబ్‌నగర్, అన్మగల్ హయత్‌నగర్ ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములను పరిశీలించారు. హయత్‌నగర్ రెవెన్యూ మండలంలో 6 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రెండు బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములను గుర్తిస్తున్నారు. కుంట్లూర్ కల్వంచ, సాహెబ్‌నగర్ ఖుర్ధు, కల్సా హయత్‌నగర్‌లో సాగు భూములు దాదాపు లేనట్లుగా అధికారులు గుర్తించడం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 35రెవెన్యూ గ్రామాలు ఉండగా సర్వే కోసం అధికారులు 4 బృదాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో నలుగురు చొప్పున అధికారులను ఏర్పాటు చేశారు. బృందంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ లేదా లైసెన్స్‌డ్ సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్, మండల వ్యవసాయ అధికారితో పాటు ఇతర అధికారులను నియమించి సాగుకు పనికి రాని భూములను, సాగు చేసే భూములను గుర్తిస్తున్నారు. ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో దాదాపు 10 గ్రామాల్లో సర్వే పనులు పూర్తి అయినట్లు తెలుస్తుంది. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి అయ్యే అవకాశం ఉంది. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించి సర్వే పనులను పరిశీలించారు. కార్యాలయంలో గూగుల్ మ్యాపును పరిశీలించారు.



అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో గూగుల్ మ్యాపును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

### గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే..?

అధికారులు గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వేను వేగంగా చేస్తున్నారు. సాగుకు పనికి రాని గుట్టలు, వ్యాపార సముదాయాలు, ఫంక్షన్ హాల్, ప్లాట్లు, ఇళ్లు, గోడౌన్‌లు, క్రికెట్ స్టేడియాలను గుర్తిస్తున్నారు. అదేవిధంగా సాగుకు పనికి వచ్చే భూములను, అందుకు సంబంధిచిన సర్వేనంబర్లను గుర్తించి రికార్డు నమోదు చేస్తున్నారు. కన్వర్షన్ అయిన భూముల వివరాలను కూడా అధికారులు సేకరించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఎక్కడ కూడా చిన్న పొరపాటు జరగకుండా గుట్టుచప్పుడు కాకుండా అధికారులు సర్వేలో నిమగ్నమైనారు.

### గ్రామ సభల్లో రైతు భరోసా జాబితా..?

అధికారులు సేకరించిన సాగు భూములు, సాగుకు పనికి రాని భూముల జాబితాను 21వ తేదీన ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో ప్రకటించే అవకాశం ఉంది. ఫిర్యాదులు వస్తే దానిపై మరోసారి సర్వే చేసే అవకాశం ఉంది.

# అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- మలక్‌పేట ఆర్టీఓ కిష్టయ్య

**చాదర్‌ఘాట్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** వాహనదారులు ట్రాఫిక్‌పై అవగాహన కలిగిఉండాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని మలక్‌పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మలక్‌పేట ఆర్టీఏ ఈస్ట్ జోన్ ఆర్టీఓ లెక్కల కిష్టయ్య, మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో వాహనదారులను ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, కార్లు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకున్న తర్వాత వాహనాన్ని నడపడం మొదలు పెట్టాలంటూ ఆర్టీఓ కిష్టయ్య వాహనదారులకు సూచించారు. పలువురు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా నడుపుతున్న యువకులకు హెల్మెట్ వాడడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు ఏవిధంగా తలను కాపాడుకోవచ్చో వివరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే వచ్చే ప్రమాదంతో పాటు వారి కుటుంబాలకు కలిగే ఆర్థిక ఇబ్బందులపై ఇటీవల జరిగిన పలు సంఘటనలను వివరించారు. ట్రాఫిక్‌పై అవగాహనతో ప్రమాదాలను అరికట్టడంతో పాటు తద్వారా జరిగే నష్టాల నుంచి కాపాడుకోగలుగుతారన్నారని వివరిస్తూ వాహనదారులకు గులాబీ పువ్వులను అందజేశారు. ఈ అవగాహన ర్యాలీలో ఎంవీఐ రమేష్‌బాబు, రాధిక, నరేంద్రపాల్, బలరాం, ఏఎంవీఐ మధుసూదన్‌రెడ్డి, జాన్, అశ్వక్ అహ్మద్, ఏవోలు ప్రవీణ్, అంజుం, మధుకర్ పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతున్న యువకుడికి అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ కిష్టయ్య తదితరులు



బాలాపూర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్

## బాలాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

**సరూర్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ 15వ డివిజన్‌లోని సీపీఎస్ఆర్‌కాలనీ, గ్రీన్‌సిటీ కాలనీ, సీతాహోమ్స్, 16వ డివిజన్‌లోని బాలాపూర్ గ్రామంలో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాలనీలు, బస్తీలు, గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరీ జైహింద్‌కుమార్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, నాయకులు టేకుల శశిధర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### అల్మాస్‌గూడలో..

అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లోని జయశంకర్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, 26వ డివిజన్‌లోని శ్రీశ్రీహోమ్స్ కాలనీలో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పనులకు కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, రామిడి కవితా రాంరెడ్డి, ముత్యాల లలితాకృష్ణతో కలిసి మేయర్ పారిజాతారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## మండలి ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించండి : ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

**హయత్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి):** త్వరలో జరగబోయే శాసన మండలి ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ముగ్గురు అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి కోరారు. శుక్రవారం హయత్‌నగర్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ తపస్ మద్దతుతోనే తాను ఎమ్మెల్సీగా గెలుపొంది ఉపాధ్యాయుల సమస్యలను చట్ట సభల్లో మాట్లాడే అవకాశం దక్కిందన్నారు. త్వరలో జరగబోయో మండలి ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన ముగ్గురు అభ్యర్థులకు తిరిగి మద్దతూ ప్రకటించి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్‌లు తమ మద్దతు బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సీ అంజిరెడ్డి, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి, ప్రతినిధులు లక్ష్మణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్రావ్, నరేందర్‌రావు, పాపిరెడ్డి, రమేష్, పెంటయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



